క్లుప్తంగా

యువతపైనే దేశ భవిష్యత్



సీఐ అఫ్జలొద్దీన్‌ను సన్మానిస్తున్న నాయకులు

నెన్నెల: దేశ భవిష్యత్ యువతపై ఆధారపడి ఉందని యువకులు గ్రామాభివృద్ధికి పాటుపడాలని బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలొద్దీన్ అన్నారు. మండలంలోని మైలారం హైస్కూల్ ఆవరణలో ఆదివారం ఓ ప్రైవేట్ ఆస్పత్రి వైద్య నిపుణులు నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత మత్తుపదార్థాలకు బానిస కావొద్దని నిరంతరం శ్రమించి ఉన్నత లక్ష్యాలు సాధించాలన్నారు. సైబర్‌నేరాల నుంచి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రజలు ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించకుండా ప్రతి ఒక్కరూ, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకొని జాగ్రత్తలు పాటించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్యసేవలు అందించడానికి ముందుకొచ్చిన ఆస్పత్రి వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నెన్నెల ఎస్సై ప్రసాద్, గొల్లపల్లి మాజీ ఎంపీటీసీ బొమ్మెన హరీష్‌గౌడ్, నాయకులు మల్లాగౌడ్, ఆర్‌ఎంపీల సంఘం అధ్యక్షుడు పురుషోత్తం పాల్గొన్నారు.

చపరాడకు భక్తుల పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

వేమనపల్లి: మండల కేంద్రంతో పాటు ఒడ్డుగూడం, దస్నాపూర్, కొత్తపల్లి గ్రామాలకు చెందిన సుమారు 40మంది భక్తులు చపరాడ హన్మాన్ మందిర్‌కు పాదయాత్రగా బయలుదేరారు. ఆలయ పూజారి పుల్లయ్యశర్మ ప్రత్యేక పూజలు చేసి పాదయాత్రను ప్రారంభించారు.

మంచిర్యాలఅర్బన్: మహారాష్ట్రలోని చపరాడా దత్తావతార కార్తీక్‌స్వామి మహారాజ్ 22వ పాదయాత్ర ఆదివారం మంచిర్యాలలో ప్రారంభించారు. స్థానిక ఐబీ చౌరస్తాలో ప్రారంభమైన పాదయాత్ర 31న హనుమాన్ మందిర్ ప్రశాంత్ దామ్ చపరాడాకు చేరుతుంది. జిల్లా నుంచే కాకుండా ఇతర ప్రాంత భక్తులు పాదయాత్ర చేపట్టారు. అంతకుముందు మంచిర్యాల పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో పూజ నిర్వహించారు. కార్యక్రమ నిర్వాహకులు, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న శ్రీకాంత్

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని టేకుల బస్తీలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.శ్రీకాంత్ పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1970లో కేరళ రాష్ట్రం త్రివేండ్రంలో ఎస్ఎఫ్ఐ ఆవిర్భవించిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు విద్యారంగ సమస్యలపై అలుపెరుగని పోరాటాలు సాగిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ బెల్లంపల్లి మండల కార్యదర్శి నిఖిల్, సభ్యులు మంజునాథ్, అక్షయ్, అక్షిత్ సాయి, సాయి కృష్ణ, సాయి కిరణ్, రాజశేఖర్, జశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ పట్టణ కార్యవర్గం

బెల్లంపల్లి: పట్టణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శనివారం రాత్రి జరిగిన ప్రత్యేక సమావేశంలో కొత్త కమిటీని ఎంపిక చేశారు. బెల్లంపల్లి పట్టణ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా రామగిరి మహేష్, ఉపాధ్యక్షుడిగా పి.రాము, ప్రధాన కార్యదర్శిగా నాతరి శివకృష్ణ, కార్యదర్శిగా ఎం.సురేష్, సంయుక్త కార్యదర్శిగా ఆర్.నరేష్, కళామండలి ఇన్‌చార్జీగా చంద్రయ్యలను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి బుర్ర సతీష్ మాదిగ, జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య ప్రకటించారు.

నియామకం



కార్యవర్గంతో సంఘం నాయకులు

వేమనపల్లి: రాష్ట్ర అనుభవ వైద్యుల సంఘాల కార్యదర్శి శంకరయ్య, చెన్నూర్ మండల అధ్యక్షుడు బండారు లక్ష్మణ్ ఆధ్వర్యంలో మండల అనుభవ వైద్యుల సంఘం అధ్యక్షుడిగా దుర్గం తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా సంతోష్ కుమార్‌ను ఆదివారం ఎన్నుకున్నారు. కోశాధికారిగా తలండి రమేష్, గౌరవ అధ్యక్షుడిగా దేవసాని శంకరయ్య, సలహాదారులుగా దేవసాని రమేశ్, కొటారి మల్లేశ్, ఉపాధ్యక్షులుగా బందెల లక్ష్మణ్, కోల పోచగౌడ్, కార్యదర్శిగా తైద లక్ష్మయ్య, గడ్డం శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.

కంపుకొడుతున్నయ్..!

- వాహనం కదలదు.. చెత్త తరలదు
- మున్సిపాలిటీల్లో అస్తవ్యస్తంగా పారిశుద్ధ్య నిర్వహణ
- రోడ్లపైనే పేరుకుపోతున్న చెత్తాచెదారం
- దుర్వాసనతో జనం అవస్థలు
- పలుచోట్ల వేధిస్తున్న సిబ్బంది కొరత

జిల్లాలో ఏటా పట్టణ జనాభా పెరుగుతోంది. ఉద్యోగం, చదువులు, ఉపాధి నిమిత్తం పట్టణాల్లో నివాసం ఉండేందుకు ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నారు. అయితే పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్యం మెరుగుపడటం లేదు. ట్రాలీలు ఉన్నా ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా అమలు కావడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. రోడ్లపై చెత్త కుప్పలు పేరుకుపోయి కాలనీలు కంపు కొడుతున్నాయి. కొన్నిచోట్ల మున్సిపల్ సిబ్బందే చెత్త, ప్లాస్టిక్ కవర్లను మంట పెట్టి కాలుస్తున్నారు. పొగ, దుర్వాసనతో జనం రోగాల పాలవుతున్నారు. మున్సిపాలిటీల్లో పారిశుధ్య నిర్వహణపై ఆదివారం 'సాక్షి' విజిట్‌లో అనేక విషయాలు వెలుగుచూశాయి.

పారిశుద్ధ్య లోపం..!



శివాలయం రోడ్డులో అధ్వానంగా డ్రైయినేజీ

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం లోపించింది. మున్సిపాలిటీలో 18వార్డులు ఉండగా 25,579జనాభా ఉంది. వార్డులలో పారిశుద్ధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు చెత్తను తరలించేందుకు 18 చెత్త వాహనాలు కొనుగోలు చేశారు. ప్రస్తుతం 12వాహనాలు వినియోగంలో ఉన్నాయి. మరో 4వాహనాలు చెడిపోవడంతో మూలనపడ్డాయి. మున్సిపాలిటీలో వార్డులకు సరిపడా వాహనాలు లేకపోవడంతో స్థానిక జెండావాడ, మారెమ్మవాడ, లైన్‌గడ్డ, జగన్నాథాలయం వీధిలలో చెత్తను శుభ్రం చేయకపోవడంతో రోడ్లపై చెత్త చెదారం పేరుకుపోయింది. రౌండ్ హనుమాన్ టెంపుల్ నుంచి శివాలయంకు వెళ్లే దారిలో డ్రైయినేజీలు శుభ్రం చేయకపోవడంతో అస్తవ్యస్తంగా మారాయి. మున్సిపాలిటీలో 63మంది పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు. మున్సిపాలిటీలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. రోజుకో వార్డు చొప్పున పనులు చేపడుతుండడంతో ఇతర కాలనీలలో పారిశుధ్యం లోపించి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వార్డులలో పనులు ఎప్పటికప్పుడు నిర్వహించాలని కోరుతున్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..!

బెల్లంపల్లి: ద్వితీయ శ్రేణి బెల్లంపల్లి మున్సిపాలిటీలో చెత్త సేకరణ పనులు అధ్వానంగా జరుగుతున్నాయి. సరిపడా పారిశుద్ధ్య సిబ్బంది లేక రోజువారీగా బస్తీలల్లో చెత్తను సేకరించలేకపోతున్నారు. ఈ కారణంగా ఎక్కడి చెత్త అక్కడే రోజుల తరబడి పేరుకుపోయి ఉంటోంది. బజారు ఏరియా ప్రధాన రహదారి, ముఖ్యమైన కొన్ని వార్డుల్లో మాత్రమే పారిశుద్ధ్యం పనులు నిర్వహిస్తున్నారు. మున్సిపాలిటీలో 34వార్డులు ఉండగా వీటిలో రోజుకు గరిష్ఠంగా 25టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. నిబంధనల ప్రకారం పారిశుద్ధ్య సిబ్బంది 140మంది వరకు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 55మంది మాత్రమే పని చేస్తున్నారు. సిబ్బంది పోస్టులను భర్తీ చేయకపోవడంతో పారిశుద్ధ్య పనుల నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మున్సిపాలిటీలో మెజార్టీ వార్డులు పారిశుద్ధ్యం లోపించి కంపుకొడుతున్నాయి. సేకరించిన చెత్తను డంప్‌యార్డుకు తీసుకెళ్లే ఆటో ట్రాలీల సమస్య కూడా తీవ్రంగా ఉంది. ప్రతి వార్డుకొకటి చొప్పున ఆటో ట్రాలీ ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 22మాత్రమే ఉన్నాయి. వీటిలో 14ట్రాలీలు మాత్రమే కండీషన్‌లో ఉండగా 8ఆటో ట్రాలీలు మరమ్మతులకు వచ్చి మూలకుపడ్డాయి. పారిశుద్ధ్య నిర్వహణపై అటు మున్సిపల్ ప్రజా ప్రతినిధులు ఇటు అధికారులు అశ్రద్ధ పెడుతుండటంతో పుర ప్రజలు అనివార్యంగా దుర్గంధంతో బాధపడాల్సి వస్తోంది.



బూడిదగడ్డ బస్తీకి వెళ్లే రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం

చెత్త తీసుకెళ్లడం లేదు



టేకుల బస్తీలో చెత్త సేకరణ సరిగ్గా జరగడం లేదు. పక్షం రోజులకోసారి సుత మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది వచ్చి చెత్తను సేకరిస్తలేరు. ఆటో ట్రాలీలు సుత వస్తలేవు. ఇళ్లకు దగ్గర చెత్త కుప్పలు ఉంటుండటంతో మేమే నిప్పుపెట్టి కాలుస్తున్నమ్. మున్సిపాలిటోళ్లు పట్టించుకోకపోవడంతో చెత్త నుంచి వచ్చే కంపువాసనను భరించలేకపోతున్నం. ఏరోజుకారోజు చెత్తను సేకరించి తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలి.

– కోట ఇందు, గృహిణి, టేకుల బస్తీ

చెత్త సేకరణ సరిగ్గానే జరుగుతోంది

మున్సిపాలిటీలో సానిటేషన్ సిబ్బంది సమస్య ఉంది. సరిపడా ఆటో ట్రాలీలు కూడా లేవు. ప్రస్తుతం ఉన్న సిబ్బందితో వార్డుల్లో పారిశుద్ధ్యం పనులు జరిపిస్తున్నాం. ప్రతి రెండు వార్డులకొకటి చొప్పున ఆటో ట్రాలీలను పంపించి సేకరించిన చెత్తను డంప్‌యార్డుకు పంపించే చర్యలు తీసుకుంటున్నాం. ఉన్నంతలో పారిశుద్ధ్యం పనులు చేయిస్తున్నాం.

– సంతోష్, సానిటరీ ఇన్‌స్పెక్టర్, బెల్లంపల్లి

పేరుకుపోతున్న చెత్త



వైశ్యభవన్ ఏరియాలో ఆటో ట్రాలీలో చెత్త తీసుకెళ్తున్న మున్సిపల్ కార్మికులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలో చెత్త సేకరణను పారిశుధ్య కార్మికులు చేపడుతున్నా, సేకరించిన చెత్తను తరలించడంలో జాప్యం జరుగుతుంది. మున్సిపాలిటీలో ప్రతి రోజు 44మెట్రిక్ టన్నుల చెత్త వెలువడుతుండగా, దాదాపుగా రోజుకు 42మెట్రిక్ టన్నుల చెత్తను తొలగిస్తున్నారు. నిత్యం చెత్తను తరలించేందుకు గాను ఒక్కో వార్డుకు ఒక్కో ఆటోట్రాలీని కేటాయించారు. షాపింగ్‌మాల్స్ ఉన్న ఏరియాలో, ఎక్కువగా చెత్త వెలువడే పెద్ద కాలనీల్లో రెండు ఆటోట్రాలీలను కేటాయించి, మూడు వార్డులకు ఒక ట్రాక్టర్‌ను చెత్త సేకరణకు కేటాయించారు. ప్రతీరోజు చెత్తను తరలించే వాహనాల్లో ఏదో ఒకటి మరమ్మతుకు గురవుతుండడంతో, సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించలేకపోతున్నారు. వాహనం రాని వార్డులో ఆ రోజు చెత్తను కుప్పలుగా పోసి ఉంచుతుండగా, ఇతర వార్డుల్లోని వాహనాలను తీసుకొచ్చే అవకాశం లేకపోవడంతో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. మున్సిపల్‌లో 36వార్డులు ఉండగా, పారిశుధ్య పనులను చేసేందుకు గాను 34మంది పర్మినెంట్ కార్మికులు, 260మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులు 36వార్డుల్లో పనిచేస్తుండగా, చెత్తను తరలించేందుకు గాను 45ఆటో ట్రాలీలు, 15ట్రాక్టర్లు ఉన్నాయి. అయినప్పటికీ 36వార్డులు నిత్యం పూర్తి పరిశుభ్రంగా ఉంచలేని పరిస్థితి మంచిర్యాల మున్సిపాలిటీలో నెలకొంది. జిల్లా కేంద్రం కావడం, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా చెత్త తరలింపు వాహనాలు లేకపోవడం, కార్మికుల సంఖ్య సరిపడా లేకపోవడంతో కొన్ని వార్డుల్లో చెత్త పేరుకుపోయి ఇబ్బందిగా మారుతోంది.

రోడ్లపైనే చెత్త.. పట్టించుకోని అధికారులు

నస్పూర్: పట్టణ పరిధిలోని పలు కాలనీల్లో రోడ్లు, డ్రైయినేజీల్లోనే చెత్త రోజుల తరబడి నిల్వ ఉంటుంది. పేరుకుపోయిన చెత్తను ప్రతీ రోజు డంప్‌యార్డుకు తరలించాల్సి ఉన్నా, పలు కాలనీలలో చెత్తను రోజుల తరబడి తరలించకపోవడంతో చెత్త రోడ్లు, డ్రైయినేజీలలో పేరుకుపోయి ఉంటుందని కాలనీల వాసులు ఆరోపిస్తున్నారు. రోడ్లపై, ఓపెన్ ప్లాట్లలో పేరుకుపోయిన చెత్త ఇళ్లలోకి చేరుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి ప్రతీ రోజు చెత్తను తరలించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ప్రతీరోజు 22మెట్రిక్ టన్నుల చెత్త...

పట్టణంలో ప్రతీ రోజు 22మెట్రిక్ టన్నుల మేర చెత్త ఉత్పత్తి అవుతుందని అధికారులు తెలిపారు. దీనిలో 12.1మెట్రిక్ టన్నుల తడి, 7.7మెట్రిక్ టన్నుల పొడి, 2.2మిక్స్‌డ్ చెత్త లభ్యమవుతుంది. పలు వార్డులలో చెత్తను సేకరించడానికి సుమారు 140మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తుండగా, చెత్త సేకరించడానికి 41ట్రాలీలు, రెండు ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు.



ఇందిరమ్మ కాలనీలో పేరుకుపోయిన చెత్త

తీరని డంప్‌యార్డు సమస్య..

ఆర్‌కే 5 కాలనీ సమీపంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక డంప్ యార్డులో అన్ని సౌకర్యాలు లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. డంప్ యార్డులో చెత్తను గుర్తు తెలియని వ్యక్తులు తగులబెడుతుండడంతో దాని నుంచి వెలువడే దట్టమైన పొగ, దుర్వాసనతో పలు కాలనీల వాసులు శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

దుర్వాసనతో ఇబ్బంది



గాంధీచౌక్ వద్ద తీసి అలాగే ఉంచిన చెత్తకుప్ప

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలో పదిహేను వార్డులున్నాయి. 14 చెత్త వాహనాలు ఉండగా, మూడు వాహనాలు రిపేరులో ఉన్నట్లు కమిషనర్ రాజశేఖర్ తెలిపారు. 11వాహనాలతో 15వార్డులలో చెత్తను ప్రతీ రోజు శుభ్రం చేస్తున్నట్లు తెలుపుతున్నారు. వార్డులలో చెత్త కుప్పలు కొన్ని ప్రదేశాల్లో అలాగే వదిలేశారు. గాంధీచౌక్ తహసీల్దార్ కార్యాలయం రోడ్డులో ఇటీవల శుభ్రం చేసిన నాళీలోని చెత్తను అలాగే వదిలేయడంతో అటుగా వెళ్లేందుకు ప్రజలు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు.

వాహనాలు ఎక్కువ.. సిబ్బంది తక్కువ

మందమర్రిరూరల్: మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి చెత్తను ఎప్పటికప్పుడు సిబ్బంది తొలగిస్తున్నారు. చెత్త సేకరించడానికి వాహనాలు ఎక్కువ, పారిశుద్ధ్య నిర్వహణ సిబ్బంది తక్కువ ఉన్నారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 24వార్డులకు గాను మున్సిపాలిటిలో15, సింగరేణి పరిధిలో 9వార్డులున్నాయి. మున్సిపాలిటిలో చెత్త సేకరణ కోసం 24స్వచ్ఛ ఆటోలు, మూడు ట్రాక్టర్లు ఉన్నాయి. 35మంది మాత్రమే సిబ్బంది ఉన్నారు. రోజుకు 20మెట్రిక్ టన్నుల చెత్త వెలువడుతోంది. నిబంధనల ప్రకారం 10వేల మంది జనాభాకు 28మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా, మున్సిపాలిటీ పరిధిలో కేవలం 35మంది మాత్రమే పారిశుద్ధ్య పనుల కోసం కేటాయించారు. మిగిలిన సిబ్బంది అవసరం కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు అధికారులు తెలిపారు.



మున్సిపల్ ఆఫీస్ ఆవరణలో నిలిపిన వాహనాలు

వారానికోసారి తరలింపు

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 22వార్డులున్నాయి. చెత్త సేకరణకు 16ఆటో ట్రాలీలు, రెండు ట్రాక్టర్లున్నాయి. ఇందులో మూడు ఆటో ట్రాలీలు కొద్ది రోజులుగా రిపేర్లో ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలో ఉండే వార్డుల్లో చెత్త సేకరణ సక్రమంగానే జరుగుతున్నప్పటికీ ఇక్కడ సింగరేణి పరిధిలోకి వచ్చే వార్డుల్లో మాత్రం చెత్త సేకరణ అస్తవ్యస్తంగా ఉంటుంది. సేకరించిన చెత్తను డంప్‌యార్డుకు తరలించేందుకు సరిపడా వాహనాలు సింగరేణికి లేకపోవడంతో వారానికోసారి చెత్త తరలిస్తున్నారు. పోగు చేసిన చెత్త గాలికి చెల్లాచెదురై అధ్వానంగా మారుతున్నాయి.

కమ్యూనిస్టు పార్టీదే కీలక పాత్ర

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్

శ్రీరాంపూర్: భారతదేశంలో గడిచిన వందేళ్ల ప్రస్థానంలో భారత కమ్యూనిస్టు పార్టీ కీలక పాత్ర పోషించిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ తెలిపారు. ఆ పార్టీ ఆవిర్భవించి వందేళ్లలో అడుగు పెడుతున్న సందర్భంగా ఆదివారం శ్రీరాంపూర్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్కే 6 కొత్తరోడ్ నుంచి కటిక దుకాణాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమ్యూనిస్టులు ఎన్నో త్యాగాలు చేసి భారతదేశంలో కార్మిక, కర్షక, ఉద్యోగ, యువత హక్కుల కోసం పోరాడారన్నారు. ప్రజాస్వామ్య స్థాపనలో, రాజ్యాంగ పరిరక్షణలో కమ్యూనిస్టుల పాత్ర కీలకమన్నారు. నాటి స్వాతంత్ర్య సంగ్రామం నుంచి నేటి తెలంగాణ రాష్ట్ర సాధన వరకు ఎంతో మంది కమ్యూనిస్టులు అమరులయ్యారన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి జరిగిన ప్రధాన ఘట్టాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, నాయకులు కారుకూరి నగేష్, అల్ల లచ్చిరెడ్డి, నూకల రాజయ్య, మిర్యాల రాజేశ్వరరావు, ముఖ్య సమ్మయ్య, బాజీ సైదా, చిలుక రామచందర్, దొడ్డిపట్ల రవీందర్, మొగిలి లక్ష్మణ్, మహిళా సమాఖ్య కార్యదర్శి చంద్రకళ ఉమా, అశ్విని పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

శ్రీరాంపూర్: జనవరి 5, 6, 7తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే ఆల్ ఇండియా దళిత్ రైట్స్ మూవ్మెంట్ (ఏఐడీఆర్ఎం) రెండో జాతీయ మహాసభల పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. సీసీసీ కార్నర్‌లోని నరసయ్య భవన్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆ యూనియన్ అధ్యక్షుడు వీ.సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కే. రాజ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా దళితులు ఇంకా వెనుకబడిన వర్గంగానే ఉన్నారన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, సదుపాయాలు వారికి దక్కడం లేదన్నారు. దళితుల అభివృద్ధికి కేటాయించిన నిధులు దారి మళ్లుతున్నాయన్నారు. దళితుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం కలిసి కట్టుగా పోరాడాలన్నారు. ఈ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, జిల్లా అధ్యక్షులు అక్బర్ అలీ, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, నాయకులు నాగభూషణం, సీపీఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి దేవిపోషన్న, నాయకులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఎమ్మెల్సీ అభ్యర్థి బైక్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి

శ్రీరాంపూర్: పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి బైక్ ర్యాలీ నిర్వహించారు. మంచిర్యాలలో జరిగే పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన సందర్భంగా ఆదివారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం నుంచి మంచిర్యాల వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్‌లోని కార్మికుడి విగ్రహానికి ఆయన పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సీసీసీ కార్నర్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రైవేటు పాఠశాల సంఘం నాయకులు, పట్టభద్రులు ఈ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల సంఘం నాయకులు మల్లెత్తుల రాజేంద్రపాణి, రేగళ్ల ఉపేందర్, మైదం రామకృష్ణ, సత్యనారాయణ, రాజ్‌కుమార్, శ్రీనివాస్, దేవన్న రమేష్ పాల్గొన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడిపై కేసు

నెన్నెల: మండలంలోని చిన్నవెంకటపూర్‌లో బెల్టు షాపుపై దాడి చేసి ఆ షాపు నిర్వాహకుడు గొస్పాషపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. కిరాణాషాపులో మద్యం విక్రయిస్తున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు దాడి చేసినట్లు పేర్కొన్నారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

పాతమంచిర్యాల: అంగన్‌వాడీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధ) అధ్యక్షురాలు భానుమతి కోరారు. జిల్లా కేంద్రంలోని తాపీమేస్త్రీ భవనంలో ఆదివారం యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. అధ్యక్షురాలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్ చెల్లించాలని కోరారు. వయసు పైబడిన వారికి జీతంలో సగం పింఛన్ ఇవ్వాలని పేర్కొన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా భవనాల అద్దెలు, మెనూ చార్జీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అబ్బోజు రమణ, కార్యదర్శి దుంపల రంజిత్, మాజీ జిల్లా కార్యదర్శి సంకె రవి, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి అనురాధ, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భానుమతి

ఆరిజిన్ డెయిరీ సీఈవోపై దాడి

బెల్లంపల్లి: ఆరిజిన్ డెయిరీ సీఈవో కందిమళ్ల.ఆదినారాయణపై ఆదివారం రాత్రి బెల్లంపల్లిలో గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటన కలకలం రేపింది. సుమారు రాత్రి 8–30గంటల ప్రాంతంలో ఆదినారాయణ బజారు ఏరియా యూనియన్ బ్యాంక్ లైన్‌లో ఓ సెలూన్ షాపుకు వెళ్లాడు. వెంటనే ఆయనను అనుసరించిన గుర్తు తెలియని వ్యక్తులు కొందరు బార్బర్‌షాప్‌లో చొరబడి భౌతికదాడి చేశారు. అక్కడున్న వారు దాడికి యత్నించిన వ్యక్తులను అడ్డుకోవడంతో ఆదినారాయణకు స్వల్ప గాయాలయ్యాయి. ఆదినారాయణ స్నేహితుడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్ ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ ఎస్.దేవయ్య గాయపడ్డ సీఈవోను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వీడియో విడుదల చేసిన ఆదినారాయణ..

తనపై దాడికి పాల్పడింది బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మనుషులని ఆదినారాయణ ఆరోపించారు. ఘటనా వివరాలను ఓ వీడియో ద్వారా వెల్లడించారు. చిన్నయ్య మనుషులు రాగంసెట్టి సతీష్, శ్యామ్ మరో ఐదారుగురు వచ్చి కత్తితో దాడి చేసి చంపడానికి యత్నించినట్లు పేర్కొన్నారు. చిన్నయ్య జోలికి వచ్చినా, భూముల జోలికి వచ్చినా చంపుతామని హెచ్చరించినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి న్యాయం చేయాలని కోరారు.



చికిత్స పొందుతున్న ఆదినారాయణ

సంక్షిప్త వార్తలు

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అఖిల భారత అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పడిపూజ ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తా నుంచి పాఠశాల వరకు భక్తులు పెద్దమొత్తంగా హాజరై భాజా భజంత్రీల మధ్య పాటలు పాడుతూ ర్యాలీ నిర్వహించారు.

సేవ చేయడమే లయన్స్ క్లబ్ లక్ష్యం

జైపూర్: నిరుపేద ప్రజలకు, పేద విద్యార్థులకు సేవలందించడమే లయన్స్ క్లబ్ లక్ష్యమని రామగుండం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మల్లికార్జున్, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు గంగాధర్ పేర్కొన్నారు. జైపూర్‌లో నూతన లయన్స్ క్లబ్ ఏర్పాటులో భాగంగా స్థానికంగా ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు.

బియ్యం, సామగ్రి అందజేత

కాసిపేట: మండలంలోని దేవాపూర్ అచ్చుతరావు గూడెంలో సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం అయిన బాధిత మహిళ ఆత్రం సత్యవతికి ఆదివారం మెస్రం రంజిత్ అనే యువకుడు, ఆదివాసీ సేనా సభ్యుడు 25కిలోల బియ్యం, బ్లాంకెట్లు, బట్టలు, గంజులు, నిత్యవసర సరుకులు అందించారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బొజ్జు

జన్నారం: మండలంలోని కవ్వాల్ గ్రామానికి చెందిన అమీర్ హుస్సేన్ అనారోగ్యంతో మృతి చెందగా ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ఆదివారం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అమీర్ హుస్సేన్ పార్థివ దేహానికి నివాళులర్పించారు.

ఆర్థిక సాయం

జన్నారం: ఇందన్‌పల్లికి చెందిన మూతి ఎల్లవ్వ అనారోగ్యంతో బాధపడుతుంది. విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ చంద్రశేఖర్ ఆదివారం వారి కు టుంబ సభ్యులకు రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు.

ఇంటి అద్దె చెల్లించాలి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులకు నిబంధనల ప్రకారం ఇంటి అద్దె చెల్లించాలని గుర్తింపు కార్మిక సంఘం (ఏఐటీయూసీ) బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఏరియాలోని యూనియన్ ఆఫీస్‌లో నిర్వహించిన ఏరియా స్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేకే ఓసీ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నప్పటికీ, మున్సి పాలిటిలో చెల్లించే అద్దె చెల్లించకుండా యాజమాన్యం దుబ్బపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉందని తక్కువ అద్దె చెల్లిస్తుందని ఆరోపించారు.